## క్లుప్తంగా

### రూ.30వేల విరాళం



చిన్నంబావి: మండలంలోని కొప్పునూరులో హమాలీ భవన నిర్మాణానికి విరాళంగా గణేశ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎంపీపీ సోమేశ్వరమ్మ, మధుసూదన్‌రెడ్డి దంపతులు రూ.30వేల చెక్కును అందజేశారు. హమాలీ భవన నిర్మాణానికి ట్రస్టు నిర్వాహకులు చెక్కు అందించడంపై హమాలీ సంఘం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

### కనులపండువగా రథోత్సవం



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయ ఆవరణలో శనివారం అర్ధరాత్రి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి దిగదీర్పతి వరకు రథాన్ని గోవింద నామస్మరణలతో జైశ్రీరామ్ అంటూ తీసుకువెళ్లి తిరిగి ఆలయం వరకు తీసుకొచ్చారు.

### కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కొత్తకోట: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. గ్రేడింగ్ పరీక్షల్లో 30మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు బెల్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్లు హరీష్‌యాదవ్, జాఫర్‌సాధిక, ఇంతియాజ్, సుమ, జాంగిర్, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

### తాగునీటి ఎద్దడి రానివ్వం



అమరచింత: పట్టణంలో తాగునీటి ఎద్దడి కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆత్మకూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో ఐదు రోజులుగా తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని తాగునీటి బోరును మరమ్మతు చేయించారు. కాలనీలోని పైప్‌లైన్లలో ప్లాస్టిక్ కవర్లు, చెత్త పేరుకుపోయి నీళ్లు రావట్లేదని తెలిపారు. పురపాలిక సిబ్బంది ద్వారా వాటిని తొలగించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. వేసవిలో పట్టణంలోని అన్ని వార్డుల్లో తాగునీటి ఎద్దడి కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు యాదమ్మ, గడ్డమీది శ్రీనివాసులు పాల్గొన్నారు.

### 'టోల్‌గేట్' పెంపు సాకుతో టికెట్ రేట్లు పెంచొద్దు



అమరచింత: టోల్‌గేట్ ఛార్జీల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు పెంచే ఆలోచనలను విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిల్లర సమస్య ఉందని రూ.పది, ఇరవై ఇలా పెంచుకుంటూ పోయారని గుర్తు చేశారు. మళ్లీ టోల్‌గేట్ ధరలు పెరిగాయంటూ వాటి భారాన్ని ప్రజలపై మోపకూడదని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, నాయకులు శ్యాంసుందర్, తిరుపతి, ఇజ్రాయిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### కళాకారులకు జాతీయ అవార్డు

కోడేరు: మండలంలోని మైలారం చెందిన కళాకారులు డప్పుస్వామి, సువర్ణ దంపతులు హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభ ఆవరణలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఉగాది మహానంది జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.



# కలగానే డిగ్రీ కళాశాల ఏర్పాటు

- ఏళ్లుగా ఎదురుచూపు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు



డిగ్రీ కళాశాలను నిర్వహించేందుకు అధికారులు పరిశీలించిన జూనియర్ కళాశాల భవనం



ఖిల్లాఘనపురంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అధికారులు గుర్తించిన ప్రభుత్వ స్థలం

ఖిల్లాఘనపురం: చదువుతో తమ బతుకులు మారతాయని ఆశించిన విద్యార్థులకు, ఉన్నత చదువులు చదివించి తమ పిల్లలను ప్రయోజకులను చేద్దామనుకునే తల్లిదండ్రుల ఆశలు కలలుగానే మిగులుతున్నాయి. ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఎంతో మంది పేదవిద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. ఉన్నత చదువులు చదవాలంటే మహబూబ్‌నగర్, వనపర్తి పట్టణాలకు వెళ్లాలి. ఎటువెళ్లాలన్నా సుమారు 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి రావడంతో పేదరికంలో కొట్టుమిట్టాడే విద్యార్థులు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు ఏళ్ల తరబడి నేతలు హామీలు ఇస్తూనే ఉన్నారు. కళాశాలకు కావల్సిన ప్రభుత్వ భూమిని పోలీస్ స్టేషన్ వెనకాల గుర్తించిన అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

**మూడు జిల్లాలకు మధ్యన..**

మండలం వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు మధ్యస్థంగా ఉంది. ఈ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడం వలన మూడు జిల్లాలకు చెందిన ఖిల్లాఘనపురం, పెద్దమందడి, భూత్పూర్, బిజినేపల్లి, మూసాపేట్ తదితర మండలాలకు చెందిన చాలా గ్రామాలు, గిరిజనతండాలకు చెందిన వందల మంది విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుంది.

**రెండు కళాశాలల్లో వందల మంది విద్యార్థులు**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 169, తెలంగాణ మోడల్ కళాశాలలో 171 మంది కలిపి మొత్తం రెండు కళాశాలల్లో 340 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. వీరిలో ఇంటర్ పూర్తి కాగానే పట్టణాలకు వెళ్లి చదవలేని విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితి అమ్మాయిల్లో ఎక్కువగా ఉంది. తప్పని సరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఆడపిల్లలకు ఇంటి పనులు అప్పజెప్పడంతో పాటు వీలైనంత త్వరగా పెళ్లి చేసి పంపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కృషి చేయాలని కోరుతున్నారు.

**ఖర్చుతో కూడుకున్నది**



మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఉన్నందున ఇంటర్ వరకు చదివిన డిగ్రీ చదవాలంటే మహబూబ్‌నగర్ లేదా వనపర్తి పట్టణాలకు వెళ్లాలి. అక్కడకు వెళ్లి చదవాలంటే ప్రత్యేకంగా రూం తీసుకోవడంతో పాటు అధికా ఖర్చులు అవుతాయి. పేద కుటుంబాలకు చెందిన వాళ్లం కావడంతో ఇబ్బందులు ఎదురవుతాయి. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– ఎం. శివకుమార్, ఎంపీసీ, తెలంగాణ మోడల్ జూనియర్ కళాశాల

**అధికారులు చొరవ చూపాలి**

ఖిల్లాఘనపురం మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల ఏర్పాటు చేయడం వలన నిరుపేద కుటుంబాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదులువులు చదివే అవకాశం ఉంది. ఈ విషయాన్ని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి అధికారుల ద్వారా తీసుకెళ్లాం. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ప్రభుత్వ డిగ్రీకళాశాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి.

– భూమయ్య, ఖిల్లాఘనపురం

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మరాఠి అశోక్‌కుమార్

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు కేంద్రం చేస్తున్న అభివృద్ధిపై ప్రచారం నిర్వహించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్ అన్నారు. ఆత్మకూర్ మండలంలోని రేచింతలలో ఆదివారం బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమాల గురించి ఇంటింటికీ వెళ్లి తెలియ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందిస్తూ ప్రపంచ దేశాలకు భారత దేశ ఔనత్యాన్ని చాటి చెబుతున్న పీఎం నరేంద్ర మోదీపై విపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సీఎం నిరంకుశ పాలనపై చైతన్యం తీసుకు రావాలన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్‌లో బీజేపీ గెలిచే విధంగా కార్యకర్తలు సైనికులుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, రాఘవేందర్, నాగరాజు, భీంరెడ్డి, కుర్వ అశోక్, మునేంద్ర, జగదీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



తాటిపాములలో ..



వనపర్తిలో పరీక్ష సామగ్రి అందిస్తున్న రమేష్

వనపర్తి: స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు వార్షిక పరీక్షలకు కావాల్సిన ప్యాడ్లు, పెన్నులను బీఆర్‌ఎస్ నాయకుడు వజ్రాల రమేష్ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో వనపర్తి ప్రాంతానికి వన్నె తీసుకురావాలని, రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తాచాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పద్మజ, సిబ్బంది అరుంధతి, స్వప్న, మానస, భారతి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి బీఆర్‌ఎస్ జిల్లా మీడియా సెల్ కన్వీనర్ దాడి యోగానందరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ పరీక్షల్లో 10జీపీఏ తెచ్చుకోవాలని సూచించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీను, గందం విష్ణు, యాదగిరి, బీచుపల్లి, వెంకటయ్య, బాలకిష్టి, మదిలేటి, బుచ్చన్న ఉన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటును విస్మరించారు



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

అమరచింత: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని, వెంటనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కలకంటి నారాయణరెడ్డి అన్నారు. గతంలో ప్రభుత్వం దారిద్రరేఖ దిగువన ఉన్న రెడ్లను గుర్తించి న్యాయం చేస్తామని, ఈబీసీ సర్టిఫికెట్లను అందిస్తామని చెప్పిన హామీలను వెంటనే అమలు పర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్న రెడ్ల ఆర్థిక స్థితిగతులు మారడం లేదని వాపోయారు. హక్కుల సాధన కోసం రెడ్లందరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం రెడ్డిసేవా సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మణివర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్రాంరెడ్డి, తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా మాధవరెడ్డి, సహకార్యదర్శులుగా శ్రీనివాస్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, కోశాధికారిగా రఘుపతిరెడ్డితో పాటు పదిమందితో నూతన కమిటీని నియమించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



వైశాఖాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెబ్బేరు: మండలంలోని వైశాఖపూర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్త విష్ణునాయుడు గుండెపోటుతో ఆదివారం మృతి చెందడంతో ఆ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్, నాయకులు వెంకటేష్, సర్పంచ్ రవికుమార్ పూలమాలలు వేసి మృతదేహానికి నివాళులర్పించారు. మృతిడికి ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారని, వారి బాగోగుల గురించి మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సాయం అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాతపల్లి గోవిందునాయుడు, కృష్ణనాయుడు, మన్నెం, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలబడుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుద్ధారం లక్ష్మీతండాకు చెందిన కాట్రావత్ లక్ష్మణ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి పార్టీ కార్యకర్తల ద్వారా రూ. ఐదు వేలు పంపగా కార్యకర్తలు బాధితుడి ఇంటికి చేరుకుని కుటుంబ సభ్యులను అందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు పార్టీ ఎళ్లవేలలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నరహరి, వెంకటయ్య, శవన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

## 'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలు విడుదల చేస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణంలో సోమవారం కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు నెల రోజుల పాటు జరిగే కార్యక్రమం అన్ని వార్డుల్లో నిర్వహిస్తూ 18ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో సోమవారం ఇంటింటికీ వెళ్లి కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొనాలని కరపత్రాల ద్వార ప్రచారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా, వైస్‌చైర్మన్ జీఎస్ గోపి తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడు



మదనాపురంలో సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల గౌడ సంఘం అధ్యక్షుడు గోద చిన్న అంజనేయులుగౌడ్ మాట్లాడుతు పాపన్నగౌడ్ ఆశయాల మేరకు బహుజనులకు రాజ్యాధికారం సాధించేందుకు బహుజనులంతా ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడ్, డాక్టర్ నరేందర్‌గౌడ్, శ్రీనివాసులు గౌడ్, భూమయ్య, బుచ్చిబాబుగౌడ్, మాధవ్‌గౌడ్, సత్యంగౌడ్, ఎల్లగౌడ్, యాదయ్యగౌడ్, నర్సింహులుగౌడ్, శ్రీనివాసులుగౌడ్, చంద్రయ్యగౌడ్, పెద్ద అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

మదనాపురం: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా గౌడ సంఘ అధ్యక్షుడు మహాదేవన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపన్నగౌడ్ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా వర్ధంతిని నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో జనార్దన్‌గౌడ్, నాగరాజుగౌడ్, గోపిస్వామి, వడ్డె రాములు, రవీందర్‌రెడ్డి, వెంకట్ నారాయణ, హనుమాన్‌రావు, నర్సిహులుగౌడ్, రాజుగౌడ్, గోపాల్‌గౌడ్, లక్ష్మీనారాయణ గౌడ్, నర్సింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్‌చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, మాజీ సర్పంచ్‌లు అక్కి సుశీల, రాజశేఖర్‌గౌడ్, సురేందర్‌గౌడ్, నర్సింహాగౌడ్, రవీందర్‌గౌడ్, ఎస్‌ఆర్‌జీ వెంకటన్న, శివశంకర్‌గౌడ్, మోహన్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే

మదనాపురం: రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన త్వరలో రానుందని, అన్ని వర్గాల ప్రజలకు అప్పుడే మేలు జరుగుతుందని ములుగు ఎమ్మెల్యే సీతక్క జోస్యం చెప్పారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూరు మండలంలోని రేచింతలకు వెళ్తూ మదనాపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు.

### మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడం వల్ల ఈ ఆదివారం 4వేల మంది భక్తులు హాజరైనట్లు ఎండోమెంట్ అధికారి సత్యచంద్రారెడ్డి తెలిపారు. టికెట్ల హుండీ మొత్తం రూ.1.60 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.



## కల్యాణలక్ష్మి చెక్కు కోసం వచ్చి గుండెపోటుతో మృతి



నర్సమ్మ

మదనాపురం: తన మనవరాలి పెళ్లికి ప్రభుత్వం ద్వారా వచ్చిన కల్యాణలక్ష్మి చెక్కును తీసుకునేందుకు వచ్చి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికి తెలిపిన వివరాల ప్రకారం అజ్జకొల్లుకు చెందిన నడిమింటి నరసమ్మ (60) తన మనవరాలు శిరీషకు కల్యాణ లక్ష్మి చెక్కు మంజూరుకావడంతో.. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహిస్తున్న ఆత్మీయ సమావేశంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తుండడంతో అక్కడికి వచ్చింది. మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి తెచ్చుకున్న చపాతిని తింటుండగా.. అకస్మాత్తుగా గుండెపోటకు గురైంది. అక్కడే ఉన్న గ్రామస్తులు హుటాహుటిన మదనాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కొత్తకోటకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

### పటిష్ట బందోబస్తు ఏర్పాటు



పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాల

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభవుతున్నాయి. పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 140 మంది, బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 220 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో పరీక్షలు జరిగే వరకు 144వ సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్‌ఐ నాగన్న ఆదివారం పేర్కొన్నారు. ఆయా పరిసరాలల్లో గుంపులు, గుంపులుగా జనం గుమికూడవద్దని, జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచాలని ఆదేశించారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కబ్జా కోరల్లో చెరువు శిఖం భూమి

- చెరువు భూమిని కాపాడాలంటున్న రైతులు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆయకట్టు రైతులు (ఫైల్)



చెరువు శిఖంలో వేసిన మట్టి కుప్పలు

పాన్‌గల్: ప్రభుత్వం ఒక పక్క చెరువులను పునరుద్ధరిస్తూ సాగునీటి నిల్వలు పెంచేలా కృషి చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువు శిఖం భూమి కబ్జాకు గురవుతున్న ఘటన మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో వెలుగులోకి వచ్చింది. తండాలో రోడ్డు పక్కనే ఉన్న సర్వే నెం. 305లోని గొర్రకుంట చెరువు శిఖం భూమిలో కొందరు కబ్జాదారులు మట్టి పరిచి ఆక్రమించుకొని నిర్మాణాలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అక్రమ నిర్మాణాలతో చెరువులో నీటి నిల్వలు తగ్గుతాయని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు భూమి కబ్జాకు గురవుతుందనే విషయాన్ని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కబ్జాదారులు విచ్చలవిడిగా భూమిని ఆక్రమించుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు హరితహారంలో నాటిన మొక్కలను కబ్జాదారులు ధ్వంసం చేస్తూ చెరువు పరిసరాల్లో మట్టిని పరుస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి చెరువు భూమి కబ్జాకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ఏసయ్యను వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చిందని, సమగ్ర విచారణ జరిపి చెరువు భూమి కబ్జాకు గురికాకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## సీపీఆర్‌తో గుండె నొప్పికి ఉపశమనం



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాలలో పోలీస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు ప్రమాదాలు, గుండెనొప్పి వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్ ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తకోట సీఐ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం గుండెనొప్పితో చాలమంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అందువలన గుండెనొప్పి వచ్చినప్పుడు చేయాల్సిన సీపీఆర్, ప్రథమ చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాతులను వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించడంతో సరైన చికిత్స అందడంతో వారు బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు సెఫ్టీ డీఎస్పీ చంద్రభాను, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ కేటీ మల్లేష్, ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆదరించండి



మదనాపురం: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆదివారం అన్ని గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు వారి కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనం (వనభోజనం)లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు భోజనం వడ్డించడంతో పాటు వారితో కలిసి తిన్నారు. అంతకు ముందు అంబేద్కర్ చౌరస్తా నుంచి మార్కెట్ యార్డ్ వరకు వరకు ర్యాలీ నిర్వహించారు.